సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం ¸ 6 ¸ ఫిబ్రవరి ¸ 2024



అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

'స్పందన', 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమాల ద్వారా అందే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. - 8లో



లూర్దుమాత జీవితం.. ఆదర్శనీయం

లూర్దుమాత జీవితం ఆదర్శనీయమని చెన్నూరు విచారణ గురువులు, సువార్త జాతీయ వక్త రెవరెండ్ ఫాదర్ పీటర్ ప్రభాకర్ అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.7 /19.6

జిల్లాలో సోమవారం 19.6 - 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

అన్నదాతలకు భరోసా

అవ్వాతాతలకు ముద్దుల మనవడతను..
కష్టాల్లోనే కాదు అవసరమైన ప్రతీసారి తోడుగా నిలిచే ఇంటి పెద్ద కొడుకతను..
విద్యార్థులకు మావయ్యా అతడే...
ఇక అన్నదాతలకు కొండంతా అండగా నిలిచే అన్నయ్యా అతడే.

అవును.. సాగులో 'భరోసా' ఇవ్వడమే కాదు ఇంటి ముంగిటకే అన్నీ తెచ్చి వారికి తోడూగా నిలబడ్డాడు.. అందుకే రైతులు ఆయన్ను 'మా జగనన్న' అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. నాడు రాజన్న రైతన్నల కోసం ఎంతగా తపించిపోయారో.. నేడు ఆయన బిడ్డ వైఎస్ జగన్ అంతకుమించి కొండంత అండగా నిలబడ్డారు. ఆర్బీకేల పేరిట వ్యవసాయ రంగంపై సీఎంగా వైఎస్ జగన్ వేసిన ముద్ర చరిత్రలో నిలిచిపోవడం ఖాయం.

- ఆర్బీకేల ద్వారా ఉన్న ఊర్లోనే పలు రకాల వ్యవసాయ సేవలు
- విత్తు నుంచి ఎరువుల వరకు అన్ని రకాల సేవలు
- వ్యవసాయ సూచనలతోపాటు పంటల సాగుపై అవగాహన
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



చాపాడు మండలం ఖాదరాపల్లెలోని రైతు భరోసా కేంద్రం



కడప అగ్రికల్చర్ : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతన్నను రాజును చేశాడు. అందరికి అన్నం పెట్టే అన్నదాత ఆనందంగా ఉంటే అందరూ సుభిక్షంగా ఉంటారనే నమ్మకంతో వారికి అడుగడుగునా అండగా నిలిచారు. వ్యవసాయ పరంగా ఉన్న ఊర్లోనే వారికి కావాల్సిన అన్ని రకాల సేవలను అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు దగ్గర నుంచి ఎరువుల వరకు అందిస్తున్నారు. అలాగే పంటలసాగు నుంచి పంట దిగుబడుల వరకు, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించి అక్కడే కొనుగోలు చేసి వారం పదిరోజుల్లో రైతు ఖాతాలకు నగదును జమ చేస్తున్నారు. అంతేకాకుండా అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా రైతులకు పంటల సాగు విషయంలో అవసరమైన సూచనలు, సలహాలను అందిస్తూ ఆదుకుంటున్నారు.

ఉన్న ఊర్లోనే అన్ని సేవలు..

రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయకముందు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం రైతన్నలు మండల కేంద్రానికో లేక జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. ఇక పండించిన ఉత్తత్పులను విక్రయించుకోవాలంటే ఉన్న ఊర్లో దళారులను లేకుంటే దూర ప్రాంతంలో ఉన్న మిల్లుల వద్దకే వెళ్లాల్సి ఉండేది. కానీ రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తరువాత ఉన్న ఊర్లోనే అన్ని రకాల సేవలను పొందుతున్నారు. విత్తనాలు,ఎరువులు, పురుగు ముందులు సైతం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే అందుతున్నాయి. పంట ఉత్పత్తుల కొనుగోలు కూడా జరుగుతుంది. ధాన్యాన్ని రైతు కళ్లాల వద్దకు వెళ్లి ప్రభుత్వమే కోనుగోలు చేస్తోంది. వీటితోపాటు రైతులు ఏయే పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలకు ఈ క్రాపు బుకింగ్ వంటి సేవలు కూడా అందుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగినప్పుడు అంచనా వేయడం కూడా ఆర్‌బీకేల సిబ్బందే చేస్తున్నారు. ఈ పనులన్నింటి కోసం వ్యవసాయ సహాయకులను ఏర్పాటు చేశారు. ఇలా రైతు భరోసా కేంద్రాలు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నాయి.

దళారీల ప్రమేయం లేకుండా..

గ్రామీణ ప్రాంతంలో రైతులు పండించిన పంట దిగుబడులను దళారీలు ద్వారా కొనుగోలు చేసే వాళ్లు. దీంతో వారు చెప్పిందే వేదంగా ఉండేది. దీంతోపాటు తూకాలలో కూడా పలు తేడాలు ఉండేవి. కానీ ప్రస్తుతం వ్యాపారులు, దళారుల ప్రమేయం లేకుండా ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యానికి వారం పది రోజుల్లో నేరుగా రైతు ఖాతాలకే నగదును జమ చేస్తోంది.

జిల్లాలో ఉన్న మొత్తం ఆర్‌బీకేలు	:432
గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్‌బీకేలు	:422
పట్టణ ప్రాంతాల్లో ఉండే ఆర్‌బీకేలు	:12
సొంత భవనాలు ఉన్న ఆర్‌బీకేలు	:297
బేసమట్టం స్థాయిలో ఉన్న ఆర్‌బీకేలు	:46
స్లాబ్ పూర్తయిన ఆర్‌బీకేలు	:46
రూఫ్‌లెవల్ ఉన్న ఆర్‌బీకేలు	:09
స్లాబ్ పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్‌బీకేలు	:14
స్థల సమస్యతో ప్రారంభం కాని ఆర్‌బీకేలు	:10

వైఎస్సార్ రైతు భరోసా నిధుల వివరాలు ఇలా..



సంవత్సరం	రైతులు	వెచ్చించిన నిధులు (కోట్లలో)
2019-20	206708	279.93
2020-21	208747	280.06
2021-22	199344	269.11
2022-23	229013	287.50
2023-24	205600	155.00

ఎరువుల వివరాలు ఇలా...



సంవత్సరం	మెట్రిక్ టన్నుల్లో
2021-22	1,42,802
2022-23	1,43,150
2023-24	1,27,618 (జనవరి వరకు)

విత్తనాల వివరాలు ఇలా...



సంవత్సరం	క్వింటాల్లో
2021-22	65,857
2022-23	48,470
2023-24	83,018

ఆర్‌బీకేల ద్వారా అందించే సేవలివే...

- ఆర్‌బీకేల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు నిర్వహిస్తారు.
- రైతులకు సబ్సిడీ విత్తనాల గ్రామస్థాయి పంపిణీ
- గ్రామస్థాయిలో రైతులకు సర్టిఫైడ్ హామీతో కూడిన ఇన్‌పుట్‌ల సరఫరా
- ఈ క్రాపు బుకింగ్‌కు రైతు డేటాబేస్ అప్‌లోడ్ చేయడం
- రైతులకు పంట సాగుదారుల హక్కు ధృవీకరణ పత్రం జారీ చేయడం
- గ్రామస్థాయి విత్తన సేకరణ కార్యకలాపాలు, ఎంఎస్‌పి, మార్కెట్ ఇంటిలిజెన్స్, ఏఫ్‌ఏక్యూ నిబంధనలపై సమాచారం అందించడం
- పీఎం కిసాన్, వైఎస్సార్ ఆర్‌బి మరియు వైఎస్సార్ సున్నావంటి పంట రుణాల కోసం డేటా ఆప్‌లోడ్ చేయడం
- విత్తనాలు, ఎరువులు, పురుగుముందులు, పశువుల దాణా మొదలైన ముందుగా పరీక్షించిన నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్‌ల సరఫరా
- వివిధ పథకాల కింద లబ్ధిదారులందరి సామాజిక తనిఖీ, అంటే ప్రకృతి వైపరిత్యాలు, సబ్సిడీ వినాలు మొదలైనవి
- డిజిటల్ లైబ్రరీ ద్వారా తెగుళ్ల మరియు వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించడం
- పొలంబడి, సీడ్ విలేజ్ ప్రోగ్రాం, మినికిట్ ట్రయల్ ప్లాట్లు మొదలైన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌ల నిర్వహణ
- విత్తన పరీక్ష(భౌతిక స్వచ్ఛత మరియు ఆకురోత్పత్తి పరీక్ష)
- రైతుల సామర్థ్యాన్ని పెంపొందించడం, ఉత్తమ నిర్వహణ పద్ధతుల వ్యాప్తి, పొలంబడి, పద్ధతి ప్రదర్శనలు మొదలైనవి
- స్మార్ట్ టీవీ(డిజిటల్ సిగ్నేజ్) క్రాపు నిపుణులచే సాంకేతిక సెషన్‌ల చిరునామాను ప్రత్యక్ష ప్రసారం చేయడం
- అన్ని ప్రభుత్వ పథకాలకు సేవా కేంద్రం
- ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ: జంతువల ప్రథమ చికిత్స, ట్రావిస్

కష్టాలు తప్పాయ్...



రైతు భరోసా కేంద్రాలు వచ్చాక రైతులకు చాలావరకు కష్టాలు తగ్గాయి. రైతు భరోసా కేంద్రాలు లేనప్పుడు వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న సమయంలో రైతులు ఎరువులకు, పురుగుమందులకు కోసం మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. అన్ని ఊర్లో ఉండే రైతు భరోసా కేంద్రంలోనే రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు తెచ్చుకుంటున్నారు. - సంబటూరు ప్రసాదొరెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు.

ఏటా రైతు భరోసా...



రైతు బరోసా కేంద్రం ద్వారా ఈ క్రాపును సకాలంలో బుకింగ్ చేస్తున్నారు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు నష్టపరిహారం అందుతుంది. దీంతోపాటు ప్రతి ఏటా నిర్దేశించిన సమయానికి రైతు భరోసా డబ్బులు నా బ్యాంకు ఖాతాకు జమవుతోంది. దీంతో పంటలసాగు సమయంలో విత్తనాలు, ఎరువులకు డబ్బులతో సమస్య లేకుండా పోయింది. - ధనిరెడ్డి బాస్కర్‌రెడ్డి, టంగటూరు, రాజుపాలెం మండలం.

ఆర్‌బీకే ద్వారా అన్ని రకాల సేవలు..



గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయ పరంగా కావాల్సిన సేవలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయి. అలాగే పంటలసాగు సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను ఇస్తూ పంటల సాగుకు సహకరిస్తున్నారు. దీంతోపాటు రైతులు సాగు చేసిన పంటలకు చీడపీడలను ఆశించినప్పుడు కూడా సకాలంలో వారి సలహాలను పాటించి పంట నష్ట తీవ్రతను కాపాడుకుంటున్నారు. - అయితా నాగేశ్వర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి

న్యూస్‌రీల్

ఓకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్‌కు సంబంధించిన ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సెషన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 17 పరీక్షా కేంద్రాలలో 1246 మందికి 1146 మంది హాజరుకాగా 100 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో 16 పరీక్షా కేంద్రాలకు 1020 మంది హాజరుకావాల్సి ఉండగా 969 మంది హాజరుకాగా 51 మంది గైర్హాజరయ్యారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



'ఎంఎల్‌హెచ్‌పీ'ల నియామకాలు చేపడుతున్న ఆర్డీ రత్నకుమారి తదితరులు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో కడప ఐఎంఏ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఎంఎల్‌హెచ్‌పీల నియామకాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 56 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగ్‌లను కల్పించారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టినట్లు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ బత్తనయ్య, అతావుల్లా, వనీష తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో ఉద్యోగులు ధర్నా

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు నందు పనిచేస్తున్న ఉద్యోగులు వారి వేతనాల కోసం సోమవారం ప్లాంట్ గేటు బయట ధర్నా నిర్వహించారు. ప్రతి నెల వేతనాలు చెల్లించడంలో ఆలస్యం అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్ తత్కాల్ ఫీజు పెంపునకు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐపీఈ మార్చి 2024 పరీక్ష రుసుము(తత్కాల్ స్కీం) చెల్లింపుకోసం ఆలస్య రుసుముతో ఈనెల 10వ తేదీ వరకు ఇంటర్‌బోర్డు గడువు పెంచిందని ఆర్ఐవో బండి వెంకట సుబ్బయ్య తెలిపారు. ఐపీఈ పరీక్ష రుసుం చెల్లించడానికి ఇదే చివరి అవకాశం అని, ఇంకా ఎవరైన ఫీజు చెల్లించని విద్యార్థులుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ తేదీ తరువాత ఎట్టి పరిస్థితుల్లో మళ్లీ గడువు పొడగించబడదని ఆయన తెలిపారు. నిబంధనల ప్రకారం అవసరమైన ఆలస్య రుసుము రూ. 3000ను తాము చదివిన జూనియర్ కళాశాలలో చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని ఆర్ఐఓ వెంకట సుబ్బయ్య తెలిపారు.

12న అప్రెంటీస్ మేళా

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ కమ్ రోజ్‌గార్ మేళా మరియు మినిస్ట్రీస్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్ వారి ఆధ్వర్యంలో దేశమంతటా ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు అప్రెంటీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు కడప ప్రభుత్వ ఐటీఐ మైనార్టీ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా కడపలోని ప్రభుత్వ డీఎల్‌డీసీ/ఐటీఐ నందు 12వ తేదీ ఉదయం 10 గంటలకు అప్రెంటీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో వివిధ కంపెనీలు పాల్గొని తమకు కావాల్సిన ట్రేడ్ విద్యార్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులు తమ విద్యార్తల సర్టిఫికెట్స్, ఐటీఐ ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ పుస్తకం, పాస్ పోర్టు సైజ్ ఫొటోతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. అప్రెంటీస్‌షిప్ సందర్భంగా నెలకు రూ.8050 చెల్లిస్తామన్నారు.

నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(257) వైఎస్సాఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప సీఎస్ఐ స్కూల్లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా ఖాదర్‌భాష, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యక్షులుగా రంగయ్య, బాలజ్యోజి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అబ్దుల్ సత్తార్, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, బాబులు, కార్యదర్శులుగా మునివర్ధన్‌కుమార్, రాంభూపాల్‌రెడ్డి, గురయ్య, స్వరూపరాణి, రమణారెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డిలు, రాష్ట్ర కౌన్సిలర్లుగా నాగరాజు, కృష్ణారెడ్డి, గురయ్య, కుళ్లాయిరెడ్డి, బీటీ నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రవీణ, సురేంద్రనాథరెడ్డి, సుబ్బారెడ్డిలు, థాడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు, సభ్యులుగా గోవర్ధన్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, అఫ్సర్ బాష, నరసింహలతోపాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, పర్యవేక్షకులుగా ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి వ్యవహరించారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కమిటీ సభ్యులు

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : రానున్న పార్లమెంటు, అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ప్రలోభాలకు లోనుకాకుండా విధులను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బదిలీపై వచ్చిన మండల స్థాయి అధికారులతో సోమవారం వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో పోలింగ్‌కేంద్రాల వారీగా సమస్యలను పరిష్కరిచాలని చెప్పారు. పేదలందరికీ ఇళ్ల కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తి కావాలన్నారు. ఆరోగ్య సురక్ష, ప్రాధాన్యత భవనాల పెండింగ్, విశ్వకర్మ పథకం అమలు, ఆడుదాం ఆంధ్ర పోటీల ఫలితాలపై సమీక్షించారు. జేసీ గణేష్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ కార్యవర్గం



కేవీ నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు



సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కాంట్రాక్టు వింగ్ కడప జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఈ జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా కేవీ నాగిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.జయక్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఓ. సురేష్ బాబు, ఉపాధ్యక్షులుగా ఎ.నాగరత్నాచారి, కొండారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, శ్రీధర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా గఫార్‌బాషా, సహాయ కార్యదర్శులుగా బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శేషి కుమార్, జగదీశ్వర్ రెడ్డి, గురుప్రసాద్, రవి, కోశాధికారిగా విశ్వనాథ రెడ్డిలను ఎన్నుకున్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: మార్చి 3వ తేదీన నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డాక్టర్ భార్గవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో జిల్లా స్థాయి వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు చేసేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ రవిబాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, ఖాజామొహిద్దీన్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల మందిరాలు!

- జిల్లాలో 2389 అంగన్వాడీల నిర్వహణ
- వాటి పరిధిలో 1,57,015 మంది చిన్నారులు
- 4689 మంది కార్యకర్తలు, ఆయాల విధుల నిర్వహణ
- ప్రై ప్రైమరీ స్కూలుగా అంగన్వాడీ కేంద్రాల సేవలు
- చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు



చిన్నారులు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాలు బాల మందిరాలుగా మారాయి. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయి. అలాగే మంచి పౌష్టికాహారం అందించి పిల్లల ఆరోగ్యానికి తోడ్పడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అంగన్వాడీ కేంద్రాలను నాడు-నేడు పథకం కింద ఉన్నతంగా తీర్చుదిద్దుతున్నారు. నూతన భవనాలను నిర్మించి వాటి రూపురేఖలు మార్చడంతోపాటు పిల్లలకు ఉత్సాహంగా ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు. దీంతో అంగన్వాడీ కేంద్రాలకు రావడానికి పిల్లలు ఉత్సాహం చూపిస్తుంటే.. పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు అంతే ఆసక్తి చూపుతున్నారు.

సృజనాత్మకతతో విద్య

అంగన్వాడీ కేంద్రాల్లో 3-5 ఏళ్లలోపు పిల్లలందరికీ సృజనాత్మకతతో విద్యను అందిస్తున్నారు. చిన్న చిన్న ఆంగ్ల పదాలు, డ్రాయింగ్ వంటివి నేర్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే పిల్లలు కూడా అంగన్వాడీ కేంద్రాల్లో చేరుతుండడం విశేషం. ప్రీ ప్రైమరీ విద్య నాణ్యంగా అందిస్తే ఆ బిడ్డ భవిష్యత్తు అంత ఉజ్వలంగా ఉంటుందని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్యపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మరోవైపు ప్రైవేటు పాఠశాలలు కిండర్ గార్డెన్ స్కూళ్లు ఏర్పాటు చేసి వేలకు వేలు ఫీజులు చేస్తుండడంతో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా రూపుదిద్దుకున్నాయి. గతంలో అంగన్వాడీ కేంద్రాలన్నీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడానికే పరిమితం అయ్యేవి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసి ఇంగ్లిష్ మీడియంలో బోధనను ప్రవేశపెట్టి చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారు.

ఆకట్టుకునేలా విద్యాబోధన

అంగన్వాడీ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు చేసింది. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో అవగాహన పెంపొందించే విధంగా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సిలబస్‌ను రూపొందించారు. ఇప్పటికే అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. ఈ నూతన విధానంలో చిన్నారులకు ఇంగ్లీషు, మ్యాథ్స్, వర్క్ బుక్, యాక్టివిటీ పుస్తకాలను అందించారు. చిన్నారులను ఆకట్టుకునేలా బొమ్మలతో పుస్తకాలను తయారు చేశారు. వివిధ రకాల బొమ్మలు, ఆటపాటలతో బోధన సాగుతోంది.



2389
జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు

4689
ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాలు

14,888
గర్భిణీలు

14,239
బాలింతలు



చిన్నారులు 1,57,015

రెండు తరగతులుగా విద్యాబోధన



అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల వయస్సు ఆధారంగా రెండు తరగతులుగా విభజిస్తున్నాం. ప్రీ ప్రైమరీ-1లో మూడేళ్లు నిండిన చిన్నారులు, ప్రీ ప్రైమరీ-2లో నాలుగేళ్లు నిండిన పిల్లలు ఉంటారు. ఆ వయస్సు పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఆటపాటలతో విద్యాబోధన అందిస్తున్నాం.

- రెడ్డమ్మ, సూపర్‌వైజర్, కడప

ఆటపాటలతో విద్యాబోధన



అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు ఆటపాటలతో బోధన చేస్తున్నాం. పాఠాలను పాటల రూపంలో చెప్పడంతోపాటు వారు అలవోకగా నేర్చుకునే వీలుంది. ఆ విధంగా వారికి విద్యలో బలమైన పునాది వేస్తున్నాం.

- వినీల గౌరి, అంగన్వాడీ కార్యకర్త, కడప

చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పిల్లలకు ప్రాథమిక దశలో వివిధ అంశాల పట్ల అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు తమ చిన్నారులను సమీపంలోని అంగన్వాడీ కేంద్రాలకు పంపి వారికి విద్యాబుద్దులు నేర్పించాలి.

- శ్రీలక్ష్మి, పీడీ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, కడప

క్లుప్తంగా

బియ్యం దుకాణంలో చోరీ

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్ధవటం రోడ్డులోని ఓ బియ్యం దుకాణంలో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. స్థానిక సిద్ధవటం రోడ్డులోని నూర్‌బాషా కాలనీకి చెందిన పఠాన్‌చిన్న మౌలాలి ఎన్‌జీవో కాలనీ సమీపంలో బియ్యం దుకాణం నిర్వహిస్తున్నాడు. ధాన్యం కొనుగోలు చేసిన వ్యక్తులకు సోమవారం ఉదయం డబ్బులు చెల్లించాలన్న ఉద్దేశంతో దుకాణంలో ఆదివారం రాత్రి రూ.2.40 లక్షల నగదును భద్రపరిచి తాళం వేసి వెళ్లాడు. ఉదయం దుకాణాన్ని తెరిచేందుకు వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండటంతో అనుమానం వచ్చి లోపలి గదిలోని అల్మారా వద్దకు వెళ్లగా.. అందులో భద్రపరిచిన నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గ్రహించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుండగులు దుకాణంలో ఉన్న సీసీ కెమెరాల కనెక్షన్‌ను సైతం తొలగించి చాకచక్యంగా చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

లూర్దుమాత జీవితం.. ఆదర్శనీయం


ప్రార్థనల్లో పాల్గొన్న విచారణ గురువులు


నవదిన ఉత్సవాల్లో పాల్గొన్న విశ్వాసులు

కడప కల్చరల్ : లూర్దుమాత జీవితం ఆదర్శనీయమని చెన్నూరు విచారణ గురువులు, సువార్త జాతీయ వక్త రెవరెండ్ ఫాదర్ పీటర్ ప్రభాకర్ అన్నారు. స్థానిక మరియాపురంలో లూర్దుమాత తిరునాల నవదిన ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు సోమవారం జరిగిన ఆధ్యాత్మిక సభకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. వేంపల్లె విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ మెల్ల బాలస్వామి తొలుత దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం పీటర్ ప్రభాకర్ లూర్దుమాత గురించిన సందేశాన్ని అందజేశారు. దేవుని అనుగ్రహం కలిగిన మరియతల్లి పరిశుద్ధాత్మ వరంతో లోక రక్షకుడైన ఏసు క్రీస్తుకు జన్మనిచ్చారని, ఇది ప్రపంచంలో పెద్ద అద్భుతంగా భావిస్తున్నామన్నారు. ఇలాంటి అద్భుతాలు ఇంత వరకు ఎక్కడా జరగలేదని, అందుకే ఆమెను పరిశుద్ధరాలిగా పిలుస్తున్నారని తెలిపారు. పూజ ప్రారంభంలో చెన్నూరు మౌలిక సంఘ సభ్యులు, విశ్వాసులు ప్రత్యేకంగా అలంకరించిన లూర్దుమాత తేరుపై.. ఆ తల్లి స్వరూపాన్ని ఏర్పాటు చేసి మరియాపురం గ్రామం వీధుల ద్వారా చర్చి ప్రధాన వేదిక వద్దకు చేర్చారు. మౌలిక సంఘ సభ్యులు ఈ సందర్భంగా స్తుతి గీతాలను ఆలపిస్తూ జపం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ బిరుసు రాజా, సహాయ గురువు ఫాదర్ అరుణ్, ఫాదర్ గుడిమె దేవసహాయం, ఫాదర్ చిన్నప్ప, ఆరోగ్యమాత, క్రీస్తు జ్యోతి, జేఎంజే మదర్లు, చర్చి పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వి.ఎం. బాషాను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామరాజుపల్లెకు చెందిన ఓ సివిల్ కేసులో జోక్యం చేసుకుని నకిలీ పత్రాలను సృష్టించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలోనే సదరు భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అతన్ని నిందితుడిగా చేర్చి, ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కడప తాలూకా సీఐ రాజా ఇది వరకే తెలియజేశారు. ఈ సంఘటనపై, హెడ్ కానిస్టేబుల్ వి.ఎం బాషాపై ఉన్నతాధికారులకు సీఐ రాజా నివేదికను సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

హెడ్ కానిస్టేబుల్‌పై ఎస్పీకి ఫిర్యాదు

కడపకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ వి.ఎం బాషా తమను మోసం చేసినట్లు ఆరోపిస్తూ పలువురు బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 'స్పందన' (గ్రీవెన్స్‌డే)లో కడప రామరాజుపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి.. భూమి విషయంపై హెడ్ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేశాడు. తమ అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలున్నాయంటూ పరిష్కరిస్తామని వి.ఎం బాషా తనను నమ్మబలికించి డబ్బులను తీసుకున్నాడని చెమ్ముమియాపేటకు చెందిన సుబ్బారెడ్డి పేర్కొన్నాడు. తమకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు వారు విజ్ఞప్తి చేశారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. –సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



మా సొంతింటి కల నెరవేరింది. నిరుపేదలైన మాకు గతంలో మాకు ఇల్లు లేక అనేక అవస్థలు పడ్డాము. జగనన్న ముఖ్యమంత్రి కాగానే మాకు స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం అందించిన నగదు, సిమెంటు, ఇసుక, కడ్డీలు తదితర సామగ్రితోపాటు మా రెక్కల కష్టాన్ని తోడు చేయడంతో ఇల్లు బాగా కట్టుకున్నాము. మాకు అమ్మఒడి, విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలను ప్రభుత్వం అందించింది. మా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో రుచికరమైన ఆహారం తోపాటు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడం సంతోషం. మరలా జగనన్నే ముఖ్యమంత్రి అయితే నాలాంటి నిరుపేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందడంతోపాటు పిల్లలు విద్యలో రాణించి ఉన్నత శిఖరాల వైపు అధిరోహిస్తారు.

– పోలి చెంగల్‌రెడ్డి, రామక్కపల్లి, పుల్లంపేట, అన్నమయ్య జిల్లా

బిడ్డల చదువులు సాఫీగా సాగుతున్నాయ్..



మాది పేద కుటుంబం. నా భర్త బాబు కూలీ పనులు చేస్తాడు. దీంతో జీవనం సాగుతోంది. మా కుమారుడు సందీప్ 5వ తరగతి చదువుతున్నాడు. పాప లాస్య 4వ తరగతి చదువుతోంది. బిడ్డలను చదివించాలంటే కష్టంగా ఉండేది. జగనన్న ముఖ్యమంత్రి కావడంతో నా బిడ్డకు అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు వస్తోంది. దీంతో నా బిడ్డల చదువులు సాఫీగా సాగుతున్నాయి. బడిలో పుస్తకాలు, యూనిఫాం అన్నీ ఉచితంగా ఇచ్చారు. నా బిడ్డలు చదువుతున్నారంటే అది జగనన్న పుణ్యమే. థ్యాంకు జగనన్న.

–అనూష, మల్లికార్జున సర్కిల్, మదనపల్లె

అగ్నిప్రమాదంలో జొన్న పంట దగ్ధం


పూర్తిగా కాలిపోయిన జొన్న పంట

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని కామనూరు సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో జొన్న పంట దగ్ధమైంది. 19 ఎకరాల్లోని జొన్న కంకులతోపాటు చొప్ప పూర్తిగా కాలిపోయింది. బాధితులు తెలిపిన మేరకు.. చెన్నమరాజుపల్లె గ్రామానికి చెందిన జయదేవరెడ్డి, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, నాగశేఖర్‌రెడ్డి, మల్లికార్జునలు 19 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. పంట కాలం పూర్తి కావడంతో ఇటీవల 13 ఎకరాల్లో పంటను కోశారు. మిగిలిన ఆరు ఎకరాల్లో మంగళవారం జొన్న కంకులు కోయాలనుకున్నారు. అయితే సోమవారం మధ్యాహ్న సమయంలో పొలంలో ఒక్క సారిగా మంటలు రావడంతో.. చుట్టుపక్కల ఉన్న రైతులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. దీంతో మైదుకూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఎండ ఎక్కువగా ఉండటమే గాక గాలి వీచడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందినట్లు రైతులు చెబుతున్నారు. ఆరు ఎకరాల్లోని జొన్న పంట పూర్తిగా కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలంలోని చొప్ప అగ్నికి ఆహుతి అయిందని రైతులు లబోదిబోమంటున్నారు. పశువులకు మేత లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తమను ఆదుకోవాలని కోరుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బీడి తాగి పడేయంతో అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. సహాయక చర్యల్లో మైదుకూరు ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి చంద్రుడు, ఎల్ఎఫ్ వీరభద్రారెడ్డి, ఎస్‌డీఓపీ ఎం లింగమయ్య, ఫైర్‌మెన్ గౌస్, నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామంలో సోమవారం మధ్యాహ్నం వరి గడ్డి వామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన కె.ఇనాయతుల్లా 5.5 ఎకరాల్లో పండిన వరి గడ్డిని 600 కట్టలుగా చేసుకుని గడ్డి వామి వేసుకున్నాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వరి గడ్డి నుంచి మంటలు చెలరేగాయి. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాలిపోయిన వరి గడ్డి రూ.60 వేల విలువ చేస్తుందని బాధిత రైతు ఇనాయతుల్లా తెలిపాడు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

కడప సెవెన్‌రోడ్స్ : 'స్పందన', 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమాల ద్వారా అందే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జేసీతో పాటు డీఆర్వో గంగాధర్‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారాలను అందించాలని సూచించారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించి పరిష్కారానికి ఆయా అధికారులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట రావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, జిల్లా వ్యవసాయ అధికారి జేడీ నాగేశ్వర రావు, హౌసింగ్, డ్వామా పీడీలు కృష్ణయ్య, యదుభూషణ్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఎల్డీఎం దుర్గా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి అర్చకునికి అవార్డు ప్రదానం


అఖిల్ దీక్షితులుకు స్వర్ణ కంకణం, గోల్డ్ మెడల్ అందిస్తున్న నిర్వాహకులు

వల్లూరు : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రధాన అర్చకులు పీఎం అఖిల్ దీక్షితులు రాష్ట్ర అలంకార విద్వాన్ అవార్డుకు ఎంపికయ్యారు. సర్ సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం స్వర్ణ కంకణ అవార్డుల సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అర్చకులు, యాజ్ఞికులు, అలంకారం, విద్య, వైద్య రంగాలతోపాటు వివిధ కళల్లో నిష్ణాతులైన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో మన జిల్లాకు చెందిన పుష్పగిరి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రధాన అర్చకులు పీఎం అఖిల్ దీక్షితులుకు రాష్ట్ర స్థాయి అలంకార విద్వాన్ అవార్డును అందజేశారు. ఐదు రాష్ట్రాల్లోని వివిధ ఆలయాలు, ఉత్సవాల్లో దేవతా మూర్తులకు చేసిన అలంకారాల్లో ఆయన చూపిన నైపుణ్యాన్ని దృష్టిలో వుంచుకుని ఈ అవార్డును అందజేశారు. ఈ మేరకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సీవీ రామన్ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ విజయ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహేంద్రవాడ వెంకటేశ్వరరావు, శ్రీ కృష్ణ సేవా సంస్థాన్ అధ్యక్షులు బ్రహ్మశ్రీ శ్రీ కృష్ణ చాముండేశ్వర మహర్షి చేతుల మీదుగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం గోల్డ్ మెడల్, స్వర్ణ కంకణం, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. జిల్లాకు చెందిన అర్చకులు పీఎం అఖిల్ దీక్షితులుకు ప్రతిష్ఠాత్మక రాష్ట్ర స్థాయి అవార్డు రావడం పట్ల ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డితోపాటు పలువురు ఆయనను అభినందించారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి


ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్

కడప అర్బన్ : బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు.

■ సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితుల ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వుండాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌కు సంబంధించిన ఎలాంటి సమస్య వున్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్లూడబ్లూడబ్లూ డాట్ సైబర్‌క్రైమ్ డాట్ జీఓవి డాట్ ఐఎన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్.సి.ఆర్.పి)లో, లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు ఆయన సూచించారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని గుర్రాలగడ్డ సమీపంలో సోమవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కోటగడ్డ వీధికి చెందిన తబ్రేజ్‌ను కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి అరెస్ట్ చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మహబూబ్ బాషా మృతదేహం

కమలాపురం : మండల పరిధిలోని కోగటం గ్రామానికి చెందిన దొడ్డికొళ్ల మహబూబ్ బాషా(46) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్ బాషా గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాడు. మద్యానికి బానిసై తరచూ భార్య హసీనాతో ఘర్షణకు దిగేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. కుటుంబ సభ్యులను బెదిరించాలని బెడ్‌రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి పొద్దుపోయాక కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించారు. సోమవారం తెల్లవారు జామున విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత


వెంకటసుబ్బయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చెన్నప్ప

కొండాపురం : మండల పరిధి దత్తాపురం పునరావాస కేంద్రంలోని సి బ్లాక్ బుక్కపట్నం కాలనీకి చెందిన నేరెళ్ల వెంకటసుబ్బయ్య క్యాన్సర్ రావడంతో రెండు నెలల నుంచి హైదరాబాద్‌లోని బసవ తారక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు అదే గ్రామానికి చెందిన వలంటీర్ చెన్నప్ప హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేశాడు. దీంతో ఆయన వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, వలంటీర్ చెన్నప్పకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి..


వెంకటరాజశేఖర్‌రెడ్డికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ నాగన్న

దువ్వూరు : మండలంలోని పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన వెంకటరాజశేఖర్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామ వలంటీర్ నాగన్న హైదరాబాద్‌కు వెళ్లి వెంకటరాజశేఖర్‌రెడ్డికి వృద్ధాప్య పింఛన్ అందజేశారు. వలంటీర్ నాగన్నకు వెంకటరాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

కొండాపురం : తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు, టి.కోడూరు గ్రామాల్లో వేర్వేరుగా జరిగిన దొంగతనం కేసుల్లో ఇద్దరు నిందితులకు ఆరు నెలలు జైలు శిక్ష పడింది. కోర్టు కానిస్టేబుల్ సుబ్బరాయుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో పుల్లయ్య కిరాణ దుకాణంలో 2022లో చోరీకి పాల్పడిన బోయ హరిక్రిష్ణ, జగ్గం పుల్లయ్య.. 2023లో టి.కోడూరు గ్రామంలో మారెమ్మ గుడి అమ్మవారి కిరీటం దొంగలించారు. ఈ కేసుల్లో వారికి జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి సోమవారం ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. పుల్లయ్యది కర్నూలు నగరం అశోక్‌నగర్, హరిక్రిష్ణది కర్నూలు జిల్లా. ఈ కేసు ఛేదనలో కృషి చేసిన తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్, కొండాపురం సీఐ వేణుగోపాల్ కోర్టు కానిస్టేబుల్ సుబ్బరాయుడును జడ్జి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వనిపెంట హైస్కూల్‌లో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రొద్దుటూరుకు చెందిన తెలుగు పండిట్ సుధాకర్, మైదుకూరుకు చెందిన హిందీ పండిట్ ఎస్ఎం బాషా మోటార్ బైక్‌పై వనిపెంటకు బయల్దేరారు. పట్టణంలోని బద్వేలు రోడ్డులో ముందు వైపు నిలిచి ఉన్న కారు డోర్‌ను ఉన్నట్టుండి తెరవడంతో.. డోర్ తగిలి బైక్‌పై ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు రోడ్డుపై ఎగిరి పడ్డారు. హిందీపండిట్ ఎస్ఎం బాషాకు కాలు విరగడంతోపాటు మరొక కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. డివైడర్‌పై పడిన సుధాకర్ తలకు రక్తగాయాలయ్యాయి. సుధాకర్‌ను స్థానిక ఆస్పత్రిలో చేర్పించగా, ఎస్ఎం బాషాను చికిత్స కోసం కడపకు తరలించారు.

ప్రొద్దుటూరు టీడీపీలో ఎవరి తీరు వారిదే..!

- ప్రవీణే అభ్యర్థి అని ఏడాది క్రితమే లోకేష్ ప్రకటించారన్న వాసు
- టీడీపీ కార్యాలయ ప్రారంభానికి హాజరు కాని వరద, లింగారెడ్డి


టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు టీడీపీ రాజకీయం మరోమారు చర్చాంశనీయంగా మారింది. ఆ పార్టీలో ఎవరి తీరు వారిదే అన్నట్లుగా ఉంది. మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని సోమవారం పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి (వాసు), నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవ సమయంలో.. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మల్లెల లింగారెడ్డి గైర్హాజరు కాగా తర్వాత సీతారామిరెడ్డి ఇంటికి వెళ్లి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు హాజరు కాలేదు.

లోకేష్ ఎప్పుడో చెప్పారు

ప్రొద్దుటూరులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనే విషయంపై గందరగోళం నెలకొని ఉందని ఈ సందర్భంగా విలేకరులు ప్రశ్నించారు. ఇందుకు వాసు సమాధానం ఇస్తూ ఏడాదిన్నర క్రితమే ప్రవీణ్ కుమార్‌రెడ్డి జైలుకు వెళ్లినప్పుడు నారా లోకేష్ వచ్చి చెప్పారన్నారు. ప్రత్యేకంగా ఆ విషయాన్ని ప్రస్తావించాల్సిన అవసరం లేదని పరోక్షంగా సమాధానం ఇచ్చారు. ఆశావాహులు ఎందరో టికెట్ కోసం ప్రయత్నిస్తూ ఉండవచ్చని, అందులో తప్పేమి లేదన్నారు. ప్రొద్దుటూరు టికెట్‌పై ఎలాంటి గందరగోళం లేదని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందన్నారు. ఈ సంఘటన వరద, లింగారెడ్డి వర్గీయుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఆరునూరైనా ప్రొద్దుటూరు టికెట్ తనకే వస్తుందని మల్లెల లింగారెడ్డి చెబుతుండగా, తమకే వర్గ బలం ఉందని, తమ నాయకుడికే తప్పక టికెట్ ఇస్తారని వరద వర్గీయులు సమర్థించుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి తమ నాయకుడు అండగా ఉన్నారని, కేసులతో జైలుకు వెళ్లి వచ్చారని, తప్పకుండా చంద్రబాబు, లోకేష్ తమకే టికెట్ ఇస్తారని ప్రవీణ్ వర్గీయులు చెబుతున్నారు. సీఎం సురేష్ నాయుడు మాత్రం నేరుగా చంద్రబాబు కుటుంబ సభ్యులతోనే టికెట్ కోసం సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా ప్రొద్దుటూరు టికెట్‌పై అధికారిక ప్రకటన వచ్చే వరకు టీడీపీ కార్యకర్తలకు అయోమయం తప్పదు.